# ప్చ్

ఉహుఁ... వద్దు –

నాకు ---- ఇష్టంలేదు...

ఊఁ... నేను ఒప్పుకోను –

– తనంత తా వలచివచ్చిన అతిలోక మోహినిని – ఈలా ఛాందసంగా నిరాకరించి – బలవంతాన తప్పించుకున్న – ఆ కలియుగ ప్రవరాఖ్యుడివంక – ఆ అమ్మాయి – చాలా చులకనగా చూసి, ఎకసక్కెపు నవ్వుతో – ఏమి జరగనట్లు – జరిగినది మరచిపోయినట్లు – చెదిరిన పైట అంచులు కొనగోట సరిచేసుకుని – నిదానంగా, పూలబుట్ట అందుకుని ఇంటిమెట్లు ఎక్కి – తిరిగి చూడకుండా వెళ్ళిపోయింది. అతడు – కంగారు అడచుకోలేక – తలఎత్తి చూడలేక – అక్కడనుంచి అడుగు కదపలేక – అలాగే నిలువబడి పోయినాడు.

చంద్రుడు, చాలా అందగాడు – కాని, అతని చక్కదనానికి ఆసలూరించడమే కాని, వేరే ప్రతి వినియోగము కనబడకుండా ఉంది. ఎందరో అందాలరాసులు – చంద్రుడు, తమవైపు ఒకసారి చూసితే – చిరునవ్వు తెరలపొరలు విరజారనిస్తే – చాలునని – నిరీక్షిస్తున్నా – ఏమి చేయకుండా – ఎవరికి పనికిరాకుండా ... అలా అయిపోతున్నాడు.

చంద్రుడు చాలా అమాయకుడు – ఆలోచనలు ఆచారాలు, అన్ని కృత యుగమునాటివి – కోరికలు లేకకాదు – తాను చక్కనివాణ్ణని తెలియకకాదు, కాని,

'స్వభార్యా యాంచ యౌషనం' అనే వైదిక శ్లోకపాదం, అతని శృంగార లీలలకు అడ్డుపడినవి – ఆ పసిపిల్ల – భార్య – కాపురమునకు వచ్చేవరకు, 'అనాఘ్రాతం పుష్పం' కు అతడు పురుషరూపలక్ష్యముగా ఉండదలచుకున్నాడు –

ఎందరో – ఎన్ని విధాలో చెప్పారు – స్నేహితులందరూ రకరకాలుగా – హుషారిచ్చారు – బలవంతపెట్టారు – బలవంత పెట్టించారు – ప్రయోజనం?

తన పడుచుతనపు తొలి అనుభవాన్ని భావించుకుంటూ, కంపిస్తూన్న చేతితో ముసలి ముత్తయిదువ, గది తలుపులు దగ్గిరసా లాగింది. ఒక్కక్షణం ఆగి... 'లోపల గడయవేసుకోండిరా' అని వెనుదిరిగి చూసి అందరితోబాటు కలసి తానూ నవ్వింది–

పృధక్శయ్యకు అలవాటుపడ్డ – కాపురానికి ఇంకా వెళ్ళని పడుచుపిల్లలు – ఆనాడు – ఏదో – చాలా చెలిమిగా ఒకరి సరసన ఒకరు ఒరిగారు.

గది తలుపు – గడియ చప్పుడు – కాకూడదనే ఆదుర్దాతో వేసినట్లు – చప్పుడైంది –

లైటు –స్విచ్చాఫ్ – అయింది –

కొంచెం సేపటికి – చాలా తొందరగానే – మళ్ళా వెలిగింది – తెల్లవార్లు – అలా వెలుగుతూనే ఉంది –

చీకటి విడకముందే – చంద్రుడు పడకగదిని విడిచి ఈవలకు వచ్చి... వంచిన తల ఎత్తకుండా... గబ గబ మెట్లు దిగి క్రిందకు వెళ్ళిపోయినాడు –

కాఫీ వేళకు – పెళ్ళికొడు క్కోసం – ఇంట్లో వాళ్ళు వెదికారు – కాని... కనిపించలేదు –

వెన్నెల ముదిరిన రాత్రి –

ఆ – 'శుభ్రజ్యోత్స్నపులకిత యామిని' అతని, పులకితునిగా చేయలేక – సిగ్గుపడి – మధ్య మధ్య, మబ్బు తెరల మేలిముసుగు సవరించుకుంటూంది.

చంద్రుడు, దిగులుతో – కూర్చుని ఉన్నాడు.

'ఏం – కొత్త పెళ్ళికొడుకు...?'

మరీ సిగ్గుపడ్డాడు – పలుకరించినా – మారు పలుకలేకపోయినాడు – ఆ అమ్మాయి – లక్ష్మి – అతని సరసకు – వచ్చి – కూర్చుంది –

ఏం మాట్లాడవేం –

ఎందుకు – యిలా వచ్చారు?

ఈ వెన్నెలలో అలా వంటరిగా వదలి ఎలా రాగలిగావు?

చెప్పవేం?

చంద్రుడు – ఇంత సేపటినించి – మాటాడాలని – జవాబు చెప్పాలని – ప్రయత్నం చేస్తున్నాడు – కాని, ఎలా ప్రారంభించాలో, ఏమనాలో తెలియలేదు –

దిటవు తెచ్చుకున్నాడు.

లక్ష్మి.

ఆ అమ్మాయి, కనులతో సాభిప్రాయంగా ఔనని సైగచేసి కొంచెం దగ్గరగా జరిగింది...

మరి...

ఊఁ...

ఊఁ...

ఆ – అమ్మాయి...

ఎవరు –

నా... భార్య –

లక్ష్మి – అర్థంకాని చూపుతో – ఆదుర్దాతో –

ఏమి...

నా – భార్యా – – –

ఊఁ నీ భార్య – ఏమిటి? – చాలా చక్కనిదా – చదువుకున్నదా – చెప్పు – మాట్లాడవేం?

చంద్రుడు కంపించిపోయాడు – గాద్గదికంతో – కనులనీరు తెచ్చుకుంటూ – పట్టరాని అసహనంతో – అసహ్యంతో...

నా భార్య... ఉహూఁ... ఆ... ఆ అమ్మాయి – ఆడపిల్లకాదు.

అని తల మరీ వంచుకున్నాడు.

లక్ష్మి ఒక నిమిషం ఊరుకుని - నవ్వేసింది.

భలే... చంద్రం... భలేవాడవు - ఆ అమ్మాయి ఆడపిల్లకాదూ?...

ఐతే నీవు? -

కాదు, లక్ష్మి - నవ్వవద్దు - నేను చెప్పింది అర్థం కాలేదూ - ఆ పిల్ల - చిన్నతనంలో నా పెళ్ళినాటికి ఆడదే -కాని, వయసు వచ్చినకొద్దీ - మగవాడుగా - మారిపోయింది -

నిజం.

అవును - భయపడి మొదట ఎవరితోనూ చెప్పలేదట - తరువాత వాళ్ళ తలిదండ్రులకు చెప్పినా - వాళ్ళు అర్థంగాక, బయటికి తెలియనీయలేదు - ఇప్పుడు ఏమీ లాభం లేదనుకుంటాను -

అదేం?

క్రొత్తలో అయితే, వైద్యసహాయంవల్ల బాగుపడేది - ఇప్పుడు - మరి...

నీవు చెప్పేది చాలా వింతగా ఉంది అంతా - చంద్రం... అలా మారిపోవడానికి వీలున్నదా?

ఆహాఁ - ఈ మాదిరిగా జరుగుతూన్నట్లు పత్రికల్లో చదవడంలేదూ - మనదాకా వస్తేకాని...

లక్ష్మి అతని తల నిమురుతూ -

'చంద్రుడూ, నిన్నుచూస్తే - చాలా జాలిగా ఉంది - ఏం చెయ్యను' అని చాలా ఆపేక్షగా అన్నది -

చంద్రం ఆమె రెండుచేతులూ పట్టుకుని - తన దగ్గరకు లాక్కుంటూ - 'లక్ష్మి - నిన్ను నేను'...

విడిపించుకుని... నవ్వుతూ లేచి దూరంగా నిలువబడినది.

ఏమిటి? నీవు - నన్ను ప్రేమిస్తున్నావా?

**అతడు తల ఊపాడు** -

నేను - నీకు - కావాలా?

. . . . . . . . . . . .

నేను - చాలా చక్కనిదాన్ని కాదూ?

చంద్రుడు ఆప్యాయనంగా - ఆమెను సమీపించబోయినాడు.

కాని - లక్ష్మిముఖంలో ప్రేమ - ఆ ప్రసన్నభావం అదె మాయమైపోయినవి - నిశ్చల నయనాలతో -

'నేను - నిన్ను ప్రేమించడం లేదే' అన్నది రెప్పవాల్చకుండా - అతనికి ముందు అడుగుపడలేదు.

నా మీద - ప్రేమలేదూ - నీకు

ఉహూఁ

మరి - అవాళ -

అవాళా - ఏవాళ - ఓహో - అదా -

ఇది - ఇవాళ సంగతి -

ఇక - ఎప్పటికి -

ఏమో? - ఇప్పటికి -

అయితే...

- లేదు - గియితే లేదు - నాకు భయం వేస్తూంది బాబూ - నీ గాలిసోకితే - నేను కూడా - మగవాణ్ణవుతానేమోనని...

అని నవ్వుతూ, వెనుతిరిగి - తిరిగి చూసి నవ్వుతూ, ఇంట్లోకి పారిపోయింది-

- వేళకు వికసించక పోవడంచేత - వినియోగపడకుండా - తీగనే మిగిలిపోయిన మల్లెమొగ్గలు -

ఒంటరిగా - చంద్రుడు.

★ ★ ★